సాక్షి
జనగామ

బుధవారం | 26 | ఏప్రిల్ | 2023



ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పాటుకు కేసీఆర్ కుట్ర

కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఫ్యూడల్ వ్యవస్థను పునర్నిర్మించేలా సీఎం కుట్ర చేస్తున్నాడని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు.

- 8లో ▸



కనిపించని ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం

హనుమకొండ, వరంగల్ జిల్లాలో విద్యుత్ ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం ఏ మాత్రం కనిపించ లేదు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.0°/23.0°

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉన్నా సాయంత్రానికి పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

త్వరితగతిన కాంటాలు పూర్తిచేయాలి



నర్మెట: వర్షాలు మరో రెండు రోజులు కురిసే అవకాశం ఉన్నందున రైతులు కోసిన ధాన్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మండల పరిధిలోని హన్మంతాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి పలు సూచలను చేసి రిక్డాలను పరిశీలించారు. రైతులకు టోకెన్‌లు వెంటనే అందజేయాలని ఏఈఓలకు, కాంటాలు త్వరితగతిన వేయించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట డీసీఎస్‌ఓ రోజారాణి, డీఎం సంధ్యారాణి, ఎంపీడీఓ ఎండి. ఖాజా మొయిఉద్దీన్, సీసీలు యాదగిరి, కవిత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంపు

జనగామ రూరల్: 2022–23 సంవత్సరానికి గాను ప్రభుత్వం అందించే దివ్యాంగ ఉపకరణాలకు గాను దరఖాస్తుల గడువు పొడిగించినట్లు జిల్లా సంక్షేమాధికారి జయంతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్, ట్యాబ్‌లు, వీల్ చైర్లు, టీఎల్‌ఎం కిట్లు, చేతి కర్రలు, వినికిడి యంత్రాలు ఉన్నాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫసల్ బీమాను అడ్డుకుంటున్న సీఎం

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవడానికి ఫసల్ బీమా పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడితే సీఎం కేసీఆర్ ఆ పథకాన్ని రాష్ట్రంలో అమలు కానీయడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇటుకాలపల్లి, లింగంపల్లి గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించి వడగళ్లకు నష్టపోయిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వంద శాతం పంటలను అన్నదాతలు నష్టపోయారని వారికి ఎకరాకు రూ.50 వేల పరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై అబండాలు మోపడమే తప్ప చేస్తున్న అభివృద్ధి పనులు శూన్యమన్నారు. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే రైతులందరికీ ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప, నియోజకవర్గ కన్వీనర్ బళ్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి

రఘునాథపల్లి: హమాలీల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలంటూ ఈ నెల 29న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం హమాలీ సంఘం మండల అధ్యక్షుడు బైరగోని బాలయ్య అధ్యక్షతన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలందరికీ భవన నిర్మాణ కార్మికుల వలె వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. అందుకు ఈ నెల 29న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు హమాలీలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

వడగళ్ల వాన బీభత్సం

జనగామ/జనగామ రూరల్: వడగళ్ల వానతో ప్రజలు అతలాకుతలం అయ్యారు. మంగళవారం రాత్రి వడగళ్ల వర్షం బీభత్సంతో పంటలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మంగళవారం రాత్రి 7.30గంటల నుంచి 10 గంటల వరకు ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. యశ్వాతాపూర్, చౌడారం, చీటకోడూర్, పెంబర్తి, మరిగడి తదితర గ్రామాల్లో వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పశుగ్రాసం సైతం చేతికందని పరిస్థితి ఉంది. యశ్వంతాపూర్, చౌడారంలో ఇళ్లలోకి రాళ్ల వచ్చి పడ్డాయి.

మంగళవారం రాత్రి కురిసిన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
నర్మెట	50.5
తరిగొప్పుల	30.8
బచ్చన్నపేట	27.0
జనగామ	31.3
చిల్పూరు	32.5
స్టేషన్‌ఘన్‌పూర్	23.3
రఘునాథపల్లి	25.8
జఫర్‌గఢ్	6.8
పాలకుర్తి	2.0
కొడకండ్ల	7.3
దేవరుప్పుల	3.0

24 ఎకరాలు తుడిచిపెట్టుకు పోయింది..



వడ్లు రాలిన కొయ్యలను చూపిస్తున్న దంపతులు

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు దంపతుల పేరు దరావత్ లక్ష్మిసకృత్. నర్మెట మండలం కన్నెబోయినగూడెం. జనగామ, సిద్దెంకి మండలాల పరిధిలో 20 ఎకరాలు కౌలుకు తీసుకోవడంతో పాటు తమకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 14 ఎకరాలు సాధారణం, 10 ఎకరాలు ఆడ, మగ వరి వేశారు. పంట సాగు పెట్టుబడికి సుమారు రూ.8లక్షల వరకు ఖర్చు చేశారు. పంట దిగుబడి రూ.22 లక్షలు వచ్చే అవకాశం ఉండే. వరి కోతకు రావడంతో నేడు, రేపు కోయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో వడగళ్ల వర్షం వంద శాతం పంటను తుడిచిపెట్టుకుపోయింది. దీంతో రైతు దంపతులు రెండు రోజులుగా దుఃఖసాగరంలో మునిగి పోయారు.

పశువులు కూడా మేయవు..



వడగళ్లకు దెబ్బతిన్న వరిని చూపిస్తున్న రైతు

పై ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు గంపల చంద్రయ్య. జనగామ మండలం ఎర్ర గొల్లపాడు. తనకున్న 2 ఎకరాల్లో రూ.60 వేలు అప్పు చేసి పంట సాగుకు ఖర్చు చేశాడు. సోమవారం రాత్రి కురిసిన వడగళ్లతో వందశాతం పంటను కోల్పోయాడు. రాళ్ల దాడిలో విరిగిన వరికొయ్యలను కనీసం పశువులు కూడా తినలేవు.



వడ్లను ఆరబోస్తూ..



నేలవాలిన వరిపంట



గింజ లేకుండా రాలిన ఆడ, మగ వరిపంట

అల్లకల్లోలం..

39 రోజుల్లో నాలుగు సార్లు వడగళ్ల వాన

- 36,333 ఎకరాల్లో వరి, మామిడి, మొక్కజొన్నకు నష్టం
- రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో వర్షం
- వందశాతం దెబ్బతిన్న వరిపంట
- ఎవరిని కదిలించినా కన్నీటి పర్యంతమే..

జనగామ: వడగళ్ల వర్షం రైతు కుటుంబాలకు కన్నీటిని మిగిల్చింది. గత నెల నుంచి ఇప్పటి వరకు 39 రోజుల్లో నాలుగు సార్లు కురిసిన వడగళ్ల వర్షం.. వేల ఎకరాల్లో వరి, వందల ఎకరాల్లో మామిడి తోటలను దెబ్బతీసింది. వందశాతం వరి పంటకు నష్టం వాటిల్లడం చరిత్రలో చూడనిది. ఇంటికి రూపాయి తెచ్చుకోలేని దయనీయ పరిస్థితుల్లో.. గ్రామాల్లో ఎవరిని కదిలించినా కన్నీళ్లే కనిపిస్తున్నాయి. జిల్లాలో మార్చి 18వ తేదీతో పాటు ఏప్రిల్ మాసంలో మూడు సార్లు దంచికొట్టిన వడగళ్ల వర్షం.. అపార నష్టాన్ని మిగిల్చింది. గత 50 ఏళ్ల చరిత్రలో ఇటువంటి వానలు చూడలేదని వృద్ధులు చెబుతున్నారు.

జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన వడగళ్ల వాన బచ్చన్నపేట, జనగామ, నర్మెట, రఘునాథపల్లి, లింగాలఘనపురంలో తీవ్ర నష్టం కలిగించింది. ఇందులో బచ్చన్నపేట, జనగామ మండలంలో కోత దశలో ఉన్న పంటలకు వందకు వందశాతం నష్టం జరిగింది. ఆది, సోమవారాల్లో ఈ రెండు మండలాల్లో అరకిలో నుంచి కిలో బరువు ఉన్న రాళ్ల కుప్పలు తెప్పలుగా పడడండతో వరికొయ్యలు సైతం పశువులకు మేతకు ఉపయోగం లేకుండా విరిగి పోయాయి. 100 కిలో మీటర్ల వేగంతో వచ్చే గాలులను సైతం ఎదుర్కొనే తుమ్మ ఆకులు.. రోడ్లకు ఇరువైపులా నాటిన గుల్‌మొహర్ చెట్ల ఆకులు రాలి.. మోడు బారి కనిపిస్తున్నాయి. ఈ చెట్లను చూసిన గ్రామాల ప్రజలు ప్రకృతి ప్రకోపిస్తే ఎతటి దారుణం ఉంటుదోనని మాట్లాడుకుంటున్నారు. ఇప్పటి వరకు వడగళ్లతో వరి, మామిడి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు 36,333 ఎకరాల్లో నష్టం జరిగింది. ఇందులో గత నెల మార్చి 18న 4,612 ఎకరాలు, ఏప్రిల్ 22న 21, 552, 24న 10,169 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేపడుతుండగా.. మరింత నష్టం పెరిగే అవకాశం ఉంది. కాగా బచ్చన్నపేటలో మొదటి, రెండు విడుతల్లో 23 గ్రామాల పరిధిలో 6,127 మంది రైతులకు చెందిన 18వేల ఎకరాల్లోని వరి పంట దెబ్బ తినగా జనగామ మండలంలో మూడు విడతల్లో 7,929 మంది రైతులకు చెందిన 7,873 ఎకరాల్లో వరి పంట పూర్తిగా వడగళ్ల పాలైంది.



గానుగుపహాడ్ ఐకేపీ సెంటర్‌లో తడిసిన ధాన్యం రాసులు

సోమవారం రాత్రి కురిసిన వడగళ్లకు దెబ్బతిన్న పంట నష్టం వివరాలు

మండలం	గ్రామాలు	రైతులు	వరి (ఎకరాల్లో)	మామిడి (ఎకరాల్లో)	కూరగాయలు	మొత్తం
బచ్చన్నపేట	4	696	2,600	240	-	2,840
జనగామ	7	1,650	3,160	205	-	3,365
నర్మెట	7	1,311	3,350	370	50	3,770
రఘునాథపల్లి	5	89	133	13	-	146
లింగాల ఘనపురం	2	10	-	46	2	48
మొత్తం	25	3,757	9,243	874	52	10,169

వడగళ్ల బాధిత గ్రామాలు ఇవే..

సోమవారం రాత్రి జనగామ మండలంలోని గానుగపహాడ్, వెంకిర్యాల, ఎర్రగొల్లపహాడ్, మరిగడి, వడ్లకొండ, తుకుంభాయ్‌తండా, పెద్దతండా, బచ్చన్నపేట మండలంలోని కేశిరెడ్డిపల్లి, బండనాగారం, లక్ష్మాపురం, రామ చంద్రాపూర్, కొన్నె తదితర గ్రామాల్లో టన్నుల కొద్ది వడగళ్ల రాసులుగా పడడడంతో వరి, మామిడి పంట దిగుబడులు లేకుండా చేశాయి. దీంతో ఈ రెండు మండలాల పరిధిలోని కొన్ని గ్రామాల్లో ధాన్యం సెంటర్లు ఎత్తివేయాల్సిన పరిస్థితి ఉందంటే.. వడగళ్ల ప్రభావం ఎంతమేర ఉందో అర్థం చేసుకోవచ్చు.

కలెక్టర్, ఎమ్మెల్యే, రాజకీయ పార్టీల పరిశీలన

వడగళ్లతో నష్టపోయిన గ్రామాలకు కలెక్టర్ శివలింగయ్యతో పాటు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు లోకుంట్ల ప్రవీణ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శానబోయిన మహిపాల్, సీపీఎం నాయకులు వెళ్లి పంటలను పరిశీలించారు.



తుకుంభాయ్ కుంట ఏరియాలో రాలిన మామిడికాయలు

11 ఎకరాల మామిడి రాలింది..

జనగామ మండలం వెంకిర్యాల శివారు తుకుంభాయ్ తండాకు చెందిన విజేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి ఇద్దరు అన్నదమ్ములు. 11 ఎకరాల్లో మామిడి తోట సాగు చేస్తున్నారు. సోమవారం రాత్రి కురిసిన భారీ వడగళ్లు.. 75శాతం మేర మామిడి కాయలు రాలేలా చేసింది. చెట్టుకు ఉన్న కాయలు సైతం రాళ్ల దెబ్బలు తగలడంతో తక్కువ ధరకు అమ్ముడు పోయే పరిస్థితి నెలకొంది. దీంతో రూ.8లక్షల నష్టం ఉండవచ్చని బాధిత రైతు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు.



రాళ్ల దాడిలో దెబ్బతిన్న మామిడి కాయలను

అలాగే రామకృష్ణారెడ్డి 6 ఎకరాల్లో వరి సాగు చేయగా రూ.1.80లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. రాళ్ల వర్షంతో పైసా రాకుండా పోయింది.

ఎనిమిది రోజులుగా కేంద్రంలోనే..



రెండు ఎకరాల్లో వరి సాగు చేసినం. రూ.48వేల వరకు పంటసాగుకు పెట్టుబడి పెట్టాం. ఇందులో సాగునీరు లేక అరెకరం ఎండిపోయింది. 40 బస్తాల దిగు బడి వస్తే.. మద్దతు ధరకు ఆశపడి 8 రోజుల క్రితం సెంటర్‌కు వచ్చినం. ఇప్పటి వరకు కొనలేదు. రెండు రోజుల క్రితం కురిసిన వడగళ్ల వర్షంతో పూర్తిగా ధాన్యం తడిసి నష్ట పోయినం.

- కూకట్ల అమూల్య, మహిళా రైతు, గానుగుపహాడ్

రూ.3 లక్షలు నీటి పాలు



10 ఎకరాల్లో వరిసాగు చేయగా.. రూ.3లక్షల వరకు ఖర్చు వచ్చింది. 500 బస్తాల దిగుబడి వస్తుందని ఆశించాను. వడగళ్ల వర్షం.. బస్తా మిగిల్చకుండా పొట్టన బెట్టుకుంది. దీంతో పెట్టుబడి, ధాన్యం అమ్ముకుంటే వచ్చే ఆదాయం కలిపి రూ..6లక్షల వరకు నష్టం వచ్చింది.

- కె.ఉప్పలయ్య, రైతు, వెంకిర్యాల

వడగళ్లతో రైతులకు తీవ్రనష్టం

- అన్నదాతలు సహనం కోల్పోవద్దు ప్రభుత్వం ఆదుకుంటుంది
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ రూరల్/బచ్చన్నపేట/ నర్మెట:అకాల వడగండ్ల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులు సహనం కోల్పోవద్దని.. అధైర్యపడకుండా ఉండాలని..ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి మండల పరిధిలోని ఎర్రగొల్లపహాడ్, వెంకిర్యాల, గానుగపహాడ్, పెద్దపహాడ్, అడవికేశవాపూర్, వండ్లకొండ గ్రామాల్లో పంటలు పూర్తిగా ధ్వంసం కాగా పంటలను వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యం చేతికొచ్చే సమయానికి వచ్చిన వడగండ్లకు పూర్తిగా వడ్లు రాలి నేలపాలు కావడం బాధాకరమన్నారు. దెబ్బతిన్న పంటలు, నష్టం వివరాలతో నివేధికను అధికారులు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఆ నివేధికను ప్రభుత్వానికి అందజేసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం వెంకిర్యాలలో కీర్తి రాములు, ఇరుగు రాములు, ఎల్లయ్యకు చెందిన 12 గొర్రెలు పిడుగుపాటుకు మృత్యువాత పడ్డాయి. పెంబర్తికి చెందిన మల్లయ్య దున్నపోతు పిడుగుపాటుకు మృత్యువాత పడగా పరిశీలించారు. బచ్చన్నపేట , నర్మెట మండల పరిధిలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి పరిశీలించారు.



కన్నెబోయినగూడెంలో వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి


వెంకిర్యాలలో కలెక్టర్, అధికారుల పర్యటన

అకాల వర్షంతో వెంకిర్యాల గ్రామంలో పూర్తిగా ధ్వంసమైన పంటలను కలెక్టర్ శివలింగయ్య,ఆర్డీఓ మధు మోహన్, వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి కర్ణాకర్, తహసీల్దార్ రవీందర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న పంటల వివరాలతో తక్షణం అధికారులు నివేధికను తయారు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పంట నష్టపోయిన రైతులతో వారు ప్రత్యేకంగా మాట్లాడి ఓదార్చారు.

పరిహారం చెల్లించి ఆదుకోవాలి

- జనగామ-హుస్నాబాద్ హైవేపై అన్నదాతల రాస్తారోకో
- మద్దతు పలికిన కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం

జనగామ: వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతూ జనగామ -హుస్నాబాద్ ప్రధాన హైవేపై మంగళవారం అన్నదాతలు రోడ్డెక్కి 5 గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, సీపీఎంకు చెందిన తదితర నాయకులు మద్దతు పలికారు. వడగళ్లతో గింజలు రాలిన వరి కొయ్యలను రోడ్డుపై బొమ్మ రూపంలో తయారుచేసి ఆరుగాలం కష్టపడిన పంట ఎలా అయిందో ప్రజలకు చూపించే ప్రయత్నం చేశారు. కిలో మీటర్ల మేర ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో విషయం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్, ఎస్సై భరత్‌కుమార్, రుక్మాచారి, పోలీసు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి వచ్చి తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఓ దశలో పార్టీల నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కలెక్టరేట్ ఏఓ, ఇన్‌చార్జ్ ఆర్డీఓ మన్సూరీ, తహసీల్దార్ రవీందర్ రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. పరిహారం కోసం సర్వే చేసి, కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని చెప్పారు. మూడు రోజుల్లోపు సర్వే చేయించే బాధ్యత తమదని ఏసీపీ చెప్పడంతో ఆందోళన విరమించారు. రైతులకు మద్దతు తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి, సీపీఎం నాయకులు ఉన్నారు. నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. చివరకు వరికొయ్యలను దహనం చేసి నిరసన తెలిపారు.



రాస్తారోకోతో భారీగా నిలిచిన ట్రాఫిక్

బీఆర్ఎస్ పాలనలోనే సంక్షేమ పథకాలు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పాలకుర్తి బీఆర్ఎస్ ప్లీనరీలో పలు తీర్మానాలు

దేవరుప్పుల: బీఆర్ఎస్ పరిపాలనలోనే సంక్షేమ, అభివృద్ధి పథకాలు వచ్చాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో మంగళవారం బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ ప్లీనరీని నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తా నుంచి సభాస్థలి వరకు సాంస్కృతిక కళాకారుల ప్రతినిధి గడ్డం సోమరాజు ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న మంత్రి పార్టీ జెండాను ఆవిష్కరించారు. తొలుత మంత్రి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు కలిసి తెలంగాణ తల్లి, అమరువీరుల స్మారక స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన 33 అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో నాడు-నేడు స్థితిగతుల పురోగతిపై ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతోనే సీఎం కేసీఆర్ విద్య, వైద్యం, తాగు, సాగునీటి కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆ దిశలోనే తన హయాంలో రూ.40 వేల కోట్లతో మిషన్ భగీరథ పథకం అమలు చేశారని తెలిపారు. ఓరుగల్లు కేంద్రంగా రూ.1100 కోట్లతో నిర్మించే ఎంజీఎం ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుధాకర్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. దేశంలో కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చేందుకు అందరూ సంపూర్ణ తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కృతజ్ఞతలు

సీఎం కేసీఆర్ చేపట్టిన పలు పథకాల అమలుపై సభికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు, కో ఆర్డినేటర్ కల్పన, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, జీసీసీజీ మాజీ చైర్మన్ గాంధీ నాయక్, ఎంపీపీలు సావిత్రిమల్లేశం, నాగిరెడ్డి, అంజయ్య, రాజేశ్వరీ, జెడ్పీటీసీలు పల్ల భార్గవిసుందర్ రామిరెడ్డి, శ్రీనివాస్, కుమార్, శ్రీనివాసారావు, జ్యోతర్మయి, దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి అమరుల స్మారక స్తూపానికి పూలమాల వేస్తున్న మంత్రి, తదితరులు

బీఆర్ఎస్ పాలకుర్తి ప్లీనరీ తీర్మానాలు..

నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి బీఆర్. అంబేడ్కర్‌గా నామకరణం చేయాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే బీసీ కుల గణన చేపట్టాలి. రాష్ట్రానికి ఉపాధి హామీ నిధుల కోత నివారిస్తూ వ్యవసాయరంగానికి అనుసంధానం చేయాలి. తెలంగాణకు మణిహారం మన సింగరేణిని ప్రైవేట్ పరం చేయకుండా సత్వరమే వేలం పాటలు ఆపాలి. గుజరాత్ గ్రానైట్ గనుల మాదిరి సింగరేణిని తెలంగాణకు అప్పగిస్తూ కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలి. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలి. రాష్ట్ర విభజన చట్టం మేరకు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ మంజూరు చేయాలి. వరంగల్ ప్రజల చిరకాల వాంఛ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని వెంటనే ఇవ్వాలి. ములుగులో స్థలాన్ని కేటాయించినందున ఇచ్చిన హామీ మేరకు గిరిజన విశ్వవిద్యాలయం నెలకొల్పాలి. తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి, నిర్మాణ ఖర్చులను ఇవ్వాలి. రాష్ట్రానికి రావాల్సిన వాటా ధనం నిధులతో పాటు మిషన్ భగీరథ నిర్వహణకు నిధులు ఇవ్వాలి. ఎస్సీల వర్గీకరణను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలి.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

స్టేషన్‌ఘన్‌పూర్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించడంతో పాటు సమష్టిగా దోమల నిర్మూలనకు కృషి చేయాలని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక యూపీహెచ్‌సీ వారి ఆధ్వర్యంలో మలేరియా నివారణ ర్యాలీని మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. దోమల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని, మలేరియా వ్యాధిని తరిమికొట్టాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు వారం రోజుల నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి, జనగామ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజ్, డీఎంహెచ్‌ఓ రవీందర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

కాంగ్రెస్‌ను గెలిపించి సోనియాకు బహుమతిగా ఇద్దాం

● కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కాజీపేట/మడికొండ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియాగాంధీకి బహుమతిగా ఇద్దామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం కాకతీయ యూనివర్సిటీ జంక్షన్‌నుంచి ప్రారంభమై గోపాలపురం క్రాస్‌రోడ్డు, సమ్మయ్యనగర్ మీదుగా గోకుల్‌నగర్, కలెక్టరేట్ నుంచి ఫాతిమానగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణను భ్రష్టు పట్టిస్తున్న కేసీఆర్‌ను ఓడించాలన్నారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంట దిగుబడులను కోల్పోయి ఆచేతనంగా మిగిలిన రైతాంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో రాత్రి బస

భట్టి యాత్ర రాత్రి 9.30 గంటలకు మడికొండకు చేరుకుంది. వాసవిమాత కల్యాణ మంటపంలో రాత్రి బస చేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తారు. అక్కడినుంచి పాదయాత్ర ద్వారా మడికొండ చౌరస్తా, అంబేద్కర్ విగ్రహం సెంటర్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరినుంచి ధర్మసాగర్ మండలానికి వెళ్తారని పార్టీ నేతలు తెలిపారు.

ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పాటుకు కేసీఆర్ కుట్ర

● ప్రభుత్వ యూనివర్సిటీల నిర్వీర్యం
● సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
● కేయూలో నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి
● కష్టాలు, సమస్యలు చెప్పుకున్న విద్యార్థులు



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కేయూ క్యాంపస్: కొట్లాడి, సాధించుకున్న తెలంగాణలో ఫ్యూడల్ వ్యవస్థను పునర్నిర్మించేలా కేసీఆర్‌కుట్ర చేస్తున్నాడని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. తొలుత పలువురు నిరుద్యోగ విద్యార్థులు మాట్లాడుతూ తెలంగాణ వస్తే మాకు ఉద్యోగాలు వస్తాయని భావించామని కాని కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఉద్యోగాల భర్తీచేయలేదన్నారు. చివరికి ఇచ్చిన నోటిఫికేషన్లలో పేపర్ల లీకేజీతో పలు నోటిఫికేషన్లు రద్దుచేశారని అన్నారు. తాము కుటుంబాలకు దూరంగా ఉండి కష్టపడి చదుకుంటున్నామని యూనివర్సిటీల ప్రైవేటీకరణ, గ్రూప్ పేపర్ల లీకేజీ, గురుకుల పోస్టుల ఉద్యోగాల రిజర్వేషన్ల ఇబ్బందులు సమస్యలను విద్యార్థులు సీఎల్పీ నేత దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కాకతీయ యూనివర్సిటీ ఒక పెద్ద వర్సిటీగా, ఎన్నో ఉద్యమాలకు, భావజాలాలకు, సామాజిక మార్పులకు వేదికగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం లేకుండా 70 ఏళ్లనాటి ఫ్యూడల్ వ్యవస్థను పునరుద్ధరించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. నీళ్లు లేవు.. నిధులు లేవు.. నియామకాలు లేకుండా చేశారు. ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వరంగ సంస్థల్లోని ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయలేదన్నారు. తెలంగాణ లక్ష్యాలు నెరవేరేవరకూ విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొమ్మిదిన్నర ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క యూనివర్సిటీని కూడా కొత్తగా ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్రను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ యూనివర్సిటీలను మాత్రం ఏర్పాటు చేస్తుందన్నారు. రూ.5లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ ప్రభుత్వం కేసీఆర్ ఇంకా కొనసాగితే రాష్ట్రంలోని యూనివర్సిటీల భూములను కూడా అమ్మేస్తాడని ఎద్దేవా చేశారు. త్వరలో టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి లేఖ రాస్తానని చెప్పారు. పేపర్ లీకేజీలు చేసినా.. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయడం లేదన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే పోడెం వీరయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తదితరులు మాట్లాడారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్‌రావు, శోభ, రవళిరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో కేయూ విద్యార్థి జాక్ కన్వీనర్ పర్లపెల్లి శ్రీశైలం, ఆలువాల కార్తిక్, బొట్ల మనోహర్, బండి రాకేష్, డాక్టర్ తీగల ప్రేమ్ సుందర్, హెచ్ భగత్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, దేవరకొండ ఐలేష్, మధుకర్‌రావు, మంద నరేష్ ఇట్టబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కచ్చితమైన వాటా ఇవ్వాలి



గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులలో 75శాతానికిపైగా మహిళలకే కేటాయించారు. పురుష అభ్యర్థులు నష్టపోతున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే.. వారి కోటా వారికి ఇవ్వాల్సిందే. అదే విధానాన్ని చట్టసభల్లో కూడా కేసీఆర్ అమలు చేయాలి.

\- రాజశేఖర్, నిరుద్యోగ విద్యార్థి

రూ.5 భోజనం తింటూ చదువుతున్నాం



విద్యార్థుల లక్ష్యాన్ని కేసీఆర్ ప్రభుత్వం లక్షలకు అమ్ముకుంటోంది. రూ.5 భోజనం తింటూ.. చదువుకుని ఉద్యోగాలకు ప్రిపేరవుతున్నాం. రోస్టర్ పాయింట్లు చూస్తుంటే దడ పుడ్తోంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందే.. కానీ పురుషుల కోటా మాత్రం కచ్చితంగా అమలు చేయాలి.

\- దోంగ్రూ కచ్రూ, నిరుద్యోగ విద్యార్థి

నిట్‌లో కొలువుల సంబురం



క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో దుర్గాప్రసాద్, ఎన్వీ.రమణారావు

● ఉద్యోగ సాధనకు నిట్ అక్షయపాత్ర
● టెక్ మహేంద్ర సీటీఓ దుర్గాప్రసాద్
● 268 కంపెనీల్లో 1,410 మందికి ఉద్యోగాలు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో కొలువుల సంబురం మంగళవారం అంబరాన్నంటింది. నిట్ వరంగల్‌కు చెందిన 1,410 మంది విద్యార్థులు 268 కంపెనీల్లో ఫుల్ టైం ఎంప్లాయీస్‌గా ఉద్యోగాలు సాధించారు. నిట్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అక్షయ క్యాంపస్ సెలక్షన్స్ సక్సెస్ మీట్‌ను టెక్ మహేంద్ర సీటీఓ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా ప్రారంభించి, మాట్లాడారు. తాను నిట్ వరంగల్‌లోనే బీటెక్ పూర్తి చేసి క్యాంపస్ సెలక్షన్స్‌లోనే ఉద్యోగం సాధించి నేడు టెక్ మహీంద్రా కంపెనీకి సీటీఓగా పని చేస్తున్నానని తెలిపారు. ఉత్తమ విద్యకు, అత్యుత్తమ ఉద్యోగ సాధనకు నిట్ వరంగల్ క్యాంపస్ అక్షయ పాత్ర లాంటిందని కొనియాడారు. నిట్ వరంగల్‌లో విద్యనభ్యసించి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు నిట్ వరంగల్ గౌరవాన్ని ప్రపంచానికి చాటాలని తెలిపారు. నిట్ విద్యార్థులకు అత్యుత్తమ విద్యతోపాటు క్యాంపస్ సెలక్షన్స్‌కు సీసీపీడీ(సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్) ద్వారా ఉద్యోగాలను అందించేందుకు ప్రపంచంలోని కంపెనీలు పోటీపడుతున్నాయని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ విద్యార్థుల ప్రతిభకు తార్కాణంగా నిట్‌కు చెందిన ఆదిత్య సింగ్ రూ.88లక్షల వార్షిక ప్యాకేజీకి సెలక్ట్ అవ్వడమేనని అన్నారు. నిట్ క్యాంపస్ సెలక్షన్స్‌లో ఫుల్ టైం ఎంప్లాయీస్‌గా ఉద్యోగాలు సాధించిన 1,410 మంది విద్యార్థులకు సీసీపీడీ క్యాంపస్ సెలక్షన్స్ పత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీసీపీడీ హెచ్ డేవిడ్‌సన్, రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ విద్యాబోధనతోనే మంచి ప్యాకేజీ..



న్యూఢిల్లీలోని ఫరీదాబాద్ నుంచి నిట్ వరంగల్‌లో బీటెక్ సీఎస్ఈ కోసం వచ్చా. ఇక్కడి విద్యార్థుల పోటీతత్వంతో ప్రేరణ పొందాను. నిట్ అధ్యాపకుల ఉత్తమ బోధనతోనే క్యాంపస్ సెలక్షన్స్‌లో తోస్పాట్ బెంగుళూరుకు చెందిన కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.88లక్షల వార్షిక ప్యాకేజీకి సెలెక్ట్ అయ్యాను.

\- ఆదిత్య సింగ్, సీఎస్ఈ, రూ.88లక్షల ప్యాకేజీ

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టార్టప్ లక్ష్యం



నేను వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టార్టప్ కంపెనీ ఏర్పాటు చేస్తాను. నిట్‌లో ఎంఎస్సీ మాథ్స్ పూర్తి చేశాను, పూనేలోని సిటీ బ్యాంక్‌లో రూ.12లక్షల వార్షిక ప్యాకేజీకి సెలెక్ట్ అయ్యాను. కంపెనీ పెట్టి మరింతమందికి ఉద్యోగాలివ్వడమే నా లక్ష్యం.

\- తానీయా అగర్వాల్, ఎంఎస్సీ (మ్యాథ్స్), రూ.12లక్షల ప్యాకేజీ

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా..



నిట్ వరంగల్‌లో సీఎస్ఈ విభాగంలో బీటెక్ చదువుతున్న తరుణంలోనే సీసీపీడీ చొరవతో క్యాంపస్ సెలక్షన్స్‌కు ఎంపికయ్యాను. హైదరాబాద్‌కు చెందిన డీషా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.62.5లక్షల ప్యాకేజీకి ఎంపికవడం ఆనందంగా ఉంది.

\- సుషీత్‌రెడ్డి, సీఎస్ఈ, రూ.62.5లక్షలు

యూఎస్‌లో మాస్టర్స్ చేస్తా..



యూఎస్‌లో మాస్టర్స్ చేయడమే నాలక్ష్యం. నిట్‌లో ఈఈఈ విభాగంలో బీటెక్ పూర్తి చేస్తూనే క్యాంపస్ సెలక్షన్స్‌లో పాల్గొన్నాను. మా ప్రొఫెసర్స్ గైడెన్స్‌లో హైదరాబాద్‌కు చెందిన క్వాల్‌కామ్ కంపెనీలో రూ.29.7లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికవడం సంతోషంగా ఉంది.

\- రుచీరా, ఈఈఈ, రూ.29.7లక్షల ప్యాకేజీ

ఉపేందర్ మృతదేహంతో ధర్నా

● మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం
● రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్
● విద్యుత్ శాఖ నుంచి రూ.5లక్షలు, ఒకరికి ఉద్యోగం ఇస్తామని ఎస్ఈ హామీ



మృతదేహంతో రాస్తారోకో నిర్వహిస్తున్న, బంధువులు, అఖిలపక్ష నాయకులు

గార్ల: విధి నిర్వహణలో భాగంగా విద్యుదాఘాతానికి గురై సోమవారం రాత్రి మృతిచెందిన వాంకుడోత్ ఉపేందర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట అఖిలపక్షం నాయకులు, కుటుంబ సభ్యులు మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో గార్ల నుంచి పోచారం వెళ్లే వాహనదారులకు మూడు గంటపాటు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు చేరుకుని జిల్లా విద్యుత్ శాఖ అధికారులను గార్లకు రప్పించారు. పరిహారం చెల్లింపుపై బాధిత కుటుంబ సభ్యులు అఖిలపక్షం నాయకులతో జిల్లా ఎస్ఈ నరేష్, డీఈ విజయ్, ఏడీఈ రమేష్‌లు కలిసి చర్చలు జరిపారు. విద్యుత్‌శాఖ నుంచి రూ.5లక్షలు, విద్యుత్ శాఖ ఇన్సూరెన్స్, ఈపీఎఫ్ నుంచి రూ.20లక్షలు, ఉపేందర్ కుమారుడికి కాంట్రాక్ట్ బిల్ కలెక్టర్ ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని జిల్లా ఎస్ఈ నరేష్ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై బానోత్ వెంకన్న కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గార్ల సబ్‌స్టేషన్ ఎదుట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ బాలాజీ నేతృత్వంలో ఎస్సైలు బానోత్ వెంకన్న, రమాదేవి పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నూనావత్ జ్యోతి, అఖిలపక్షం నాయకులు కందునూరి శ్రీనివాసరావు, కట్టెబోయిన శ్రీనివాసరావు, దనియాకుల రామారావు, మాలోత్ వెంకట్‌లాల్, భూక్యా నాగేశ్వరరావు, జంపాల వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరిధాన్యాన్ని కుప్పగా చేస్తూ కుప్పకూలిన రైతు

● చికిత్స పొందుతూ మృతి



వెంకట్‌రెడ్డి(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఆరబోసిన ధాన్యాన్ని వర్షానికి దగ్గరికి చేస్తుండగా కుప్పకూలి పడిపోయిన ఓ రైతు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన రిక్కల వెంకట్‌రెడ్డి(60) తన వరి ధాన్యాన్ని అమ్మేందుకు గ్రామంలోని ఐకేపీ కేంద్రానికి తరలించి ఎండకు ఆరబెట్టాడు. ఈనెల 23న(ఆదివారం) సాయంత్రం వర్షం రావడంతో ధాన్యాన్ని దగ్గరగా కుప్ప చేసే క్రమంలో ఒక్కసారిగా కుప్ప కూలాడు. గమనించిన తోటి రైతులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్వాజ్ టీచర్ల బదిలీలు చేపట్టండి



హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్వాజ్ టీచర్లు

● హనుమకొండలో ర్యాలీ నిర్వహించిన టీచర్లు

విద్యారణ్యపురి: ఉమ్మడివరంగల్ జిల్లాలో ఇంకా బదిలీ కాని స్వాజ్ టీచర్లు తమకు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్వాజ్ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో హనుమకొండలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. 317 జీఓ ద్వారా భర్త ఒక జిల్లా.. భార్య మరొక జిల్లాలో ఉంటూ అనేక ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 16 నెలలుగా నిరీక్షిస్తున్నామని తమ ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది స్కూల్ అసిస్టెంట్ల స్వాజ్ టీచర్లకు బదిలీలు చేసినప్పటికీ మిగిలిన అందరినీ బదిలీ చేయాలని కోరారు. అలాగే ఎస్‌జీటీ కేటగిరి స్వాజ్ టీచర్లకు ఇప్పటివరకు బదిలీలు చేపట్టలేదని తమ ఆవేదనను ప్లకార్డుల వెలిబుచ్చారు. హనుమకొండలోని డీఈఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రంను సమర్పించారు. ఈసందర్భంగా స్వాజ్ టీచర్ల ఫోరం బాధ్యులు కందగట్ల సురేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి తమ మాటను నిలుపుకోవాలని కోరారు. వేణుగోపాల్, శ్రీనివాసస్వామి, శ్రీహరి, శరత్, రాంగోపాల్‌రెడ్డి, హుస్సేన్, రమాదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, గౌసియా, హేమలత, శ్రీపాల్, నరిసయ్య, భాస్కర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

కనిపించని ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం

● హనుమకొండ, వరంగల్‌లో వంద శాతం హాజరు
● టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 90 శాతం హాజరు



ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు

హన్మకొండ: హనుమకొండ, వరంగల్ జిల్లాలో విద్యుత్ ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్, ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇటీవల విద్యుత్ సంస్థల్లోని రెండు జేఏసీలతో వేతన సవరణ ఒప్పందంపై అసంతృప్తిగా ఉన్న ఈ రెండు యూనియన్లు యాజమాన్యాలకు సమ్మె నోటీసు ఇచ్చాయి. యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో సమ్మెకు వెళ్లాయి. కానీ, ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. మరో వైపు విద్యుత్ సంస్థల్లో సమ్మెను నిషేధాన్ని విధించింది. ఆర్టిజన్‌లు సమ్మెకు వెళ్తే ఎస్మా కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించాయి. ఈ క్రమంలో సమ్మె సందిగ్ధంలో పడ్డది. ఎక్కడ ఎస్మా ప్రయోగించి చర్యలు తీసుకుంటారో.. ఎక్కడ ఉద్యోగాలు ఊడిపోతాయోననే భయాందోళన మధ్య బలవంతంగా ఆర్టిజన్లు హాజరయ్యారు. ప్రధాన సంఘాల మద్దతు లభించకపోవడం కూడా ఆర్టిజన్లు వెనక్కు తగ్గడానికి కారణమని పలువురు ఉద్యోగులు తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలో ఆర్టిజన్లు సమ్మెకు దూరంగా ఉన్నారు. ఈ రెండు జిల్లాలో వంద శాతం హాజరయ్యారని ఎన్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. హనుమకొండ జిల్లాలో 189 మంది ఆర్టిజన్లు, వరంగల్ జిల్లాలో 183 మంది ఆర్టిజన్ ఉద్యోగులుండగా అందరు విధులకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. వంద శాతం హాజరుతో జిల్లాలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం చూపలేదు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగింది. కాగా, టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో 90శాతం ఆర్టిజన్లు విధులకు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో సమ్మె ప్రభావం కనిపించిందని తెలిపారు. ఇదిలా ఉండగా హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ భవన్‌కు పోలీసు పహారా ఏర్పాటు చేశారు. కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా వారి వివరాలు తెసుకున్నాకే లోపలికి అనుమతించారు.

బతుకుదెరువు కోసం వెళ్తూ..

● రోడ్డు ప్రమాదంలో తాత మృతి, మనుమడికి గాయాలు



ప్రమాదస్థలిలో సైదులు మృతదేహం

దేవరుప్పుల : బతుకు దెరువు కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ తాత చనిపోగా, మనుమడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన తాతమనుమళ్లు చినబత్తుల సైదులు(75), తిరుపతి ఆయుర్వేద మందుల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలోనే మంగళవారం సూర్యాపేట- జనగామ రహదారి గుండా మహారాష్ట్రకు మారుతీ వ్యాన్‌లో వెళ్తుండగా సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలోని ధారావత్‌తండా పరిధిలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టారు. ఈ ఘటనలో సైదులు అక్కడికక్కడే మృతిచెందగా.. మనుమడు తిరుపతి కాళ్లు విరిగి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. సైదులు కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● రైల్వే సంఘ్ సికింద్రాబాద్ డీఎస్ భుజంగరావు



నూతన కార్యవర్గం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ (డీఎస్) డి.భుజంగరావు అన్నారు. కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో మంగళవారం రైల్వే సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచీ 10వ జనరల్ బాడి, నూతన కార్యవర్గం ఎంపికలో భుజంగరావు మాట్లాడారు. ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.రాఘవయ్య నేతృత్వంలో రైల్వే డ్రైవర్ల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రైల్వే బోర్డు స్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే డీఎంఓ డాక్టర్ హరినాథ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్లు ఆరోగ్యంగా జాగత్తగా ఉండాలని పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రైల్వే సంఘ్ ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కె.రవి, వర్కింగ్ చైర్మన్‌గా పాక రాజ్‌కుమార్, వైస్ చైర్మన్లుగా శృతి, జి.లక్ష్మీయనారాయణ, గుప్తా, సెక్రటరీగా చింత మురళి, అసిస్టెంట్ సెక్రటరీలుగా జి.వరప్రసాద్ రెడ్డి, మేరుగు శివ, సీహెచ్.పరమేశం, ట్రెజరర్‌గా పి.సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ్ కేంద్ర కమిటీ సభ్యులు వి.మురళికృష్ణ, ఎస్.వెంకటనారాయణ, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.